నిరుపయోగంగా నీటి తొట్టెలు

వేసవిలో పశువులకు దాహార్తిని తీర్చే లక్ష్యంతో పల్లెపండుగ కింద ఉపాధి హామీ నిధులతో నీటి తొట్టెలు నిర్మించారు. సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా 278 తొట్టెలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే వాటిలో నీటిని నింపడంలో మాత్రం అలసత్వం వహిస్తున్నారు. వీటిలో నీరు పట్టే బాధ్యత స్పష్టంగా ఎవరికీ అప్పగించకపోవడంతో అందరూ అలాగే వదిలేశారు. అన్నిశాఖల అధికారులు ఇది మా పని కాదు అన్నట్లు చేతులు దులిపేసుకున్నారు. రూ.లక్షల ప్రజాధనాన్ని వృథాగా మార్చేశారు.


మాదనపాలెంలో నిరుపయోగంగా నీటి తొట్టె

- నిర్మించి వదిలేసిన అధికారులు
- దాహార్తితో అలమటిస్తున్న పశువులు

వరదయ్యపాళెం: వేసవిలో పశువులకు నీటి ఎద్దడి లేకుండా తొట్టెలను నిర్మించినా వాటిని నీటితో ఎవరు నింపాలన్నదే ప్రశ్నార్థకంగా మారింది. ఉపాధి హామీ పథకం అధికారులను తొట్లు నిర్మించాలని నిధులు మంజూరు చేసి తర్వాత వాటిని గ్రామ పంచాయతీకి అప్పగించాలని సూచించారు. పంచాయతీ అధికారులకు ఈ తొట్ల నిర్వహణకు సంబంధించి సరైన ఆదేశాలు జారీ కాలేదని చేతులెత్తేశారు. తొట్టిలను నీటితో నింపాలంటే నిధులు అవసరమని, ఆ నిధులు ఏ గ్రాంటు నుంచి ఖర్చు చేయాలో అర్థం కావడం లేదని వెల్లడిస్తున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా నిర్మించిన 278 తొట్లను నిర్మించిన తర్వాత ఒక్కసారి మాత్రమే నీటిని నింపినట్లు పాడి రైతులు ఆరోపిస్తున్నారు.

కుంటల పక్కనే..

గ్రామాల్లో పశువుల నీటి తొట్లను కుంటల పక్కనే నిర్మించారు. కుంటల వద్దకు వచ్చిన పశువులు అందులో నీరు తాగి వెళ్లిపోతున్నాయి. అలాంటప్పుడు కుంటల పక్కన కాకుండా పొలాల్లో నీటి తొట్లను నిర్మిస్తే ఉపయోగకరంగా ఉండేదని పాడి రైతులు స్పష్టం చేస్తున్నారు.

జేబులు నింపడానికే..!

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన నీటి తొట్టెలకు సంబంధించి ఒక్కోదానికి రూ.39వేలు ఖర్చు చేశారు. ఈ మేరకు అంత వెచ్చించినప్పటికీ ఉపయోగం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం కూటమి నేతల జేబులు నింపడానికే ఈ తొట్టెలు నిర్మించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆదమరిస్తే ప్రమాదమే

గ్రామాల్లో నిర్మించిన పశువుల నీటి తొట్టెల వద్ద ఆదమరిస్తే ప్రమాదం సంభవించే పరిస్థితి ఉందని స్థానికుల ఆరోపిస్తున్నారు. తొట్టెల్లో నీటిని నింపినప్పుడు పిల్లలు అందులో దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఈత సరదా కోసం తొట్టెలో పిల్లలు దిగితే మునిగిపోయే ప్రమాదముందని పలువురు హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

ముక్కంటి సేవలో రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్


ఆలయం వద్ద అనిల్‌చంద్ర పునీత్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ అనిల్‌చంద్ర పునీత్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, సీఐఎస్, ఉన్నతి, స్త్రీ నిధి పథకాలను అమలు చేస్తోందని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సమాఖ్య లీడర్లకు ఒక రోజు వీపీఆర్‌పీ శిక్షణ తరగతి నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకులో పరపతి పెంచుకోవాలన్నారు. ఆవులు, గేదెల పాలను మన పాల సెంటర్‌కు పోయడం ద్వారా గిట్టుబాటు ధర పొందవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ


విద్యాసామగ్రి అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీసెస్ అధ్యక్షుడు హేమకుమార్ అన్నారు. ఈశ్వరయ్యకాలనీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం విద్యాసామగ్రిని అందజేశారు. సంస్థ సభ్యులు రమేష్, నారాయణ, శ్రీనివాసులు, సురేష్‌బాబు, అమీర్‌బాషా, చంద్రకాంత్, ప్రదీప్‌కుమార్, హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

కంటైనర్ లారీ బోల్తా


బోల్తాపడిన కంటైనర్ లారీ

నారాయణవనం: మండలంలోని గోవిందప్పనాయుడుకండ్రిగ సమీపంలో బుధవారం సాయంత్రం అరుణానది వద్ద జాతీయ రహదారిపై ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, తిరుపతి రుయాకు తరలించారు. వివరాలు..25 టన్నుల లోడ్‌తో చెన్నైకి వెళుతున్న కంటైనర్ లారీ అరుణానది వంతెన మలుపు తిరుగుతుండగా ప్రమాదం జరిగింది.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ మల్లిగుంట గ్రామంలో వినాయక స్వామి విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం, నేతలు పెరుమాళ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై వీరభద్రుడు


ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

నారాయణవనం: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఉత్సవర్లు సింహవాహనం అధిరోహించి పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు భద్రకాళీ, వీరభద్రులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు సింహవాహనంపై ఉత్సవర్లను అధిష్టింప చేశారు. పుష్పమాలికలు, పట్టువస్త్రాలను ధరించిన వీరభద్రుడు కోటవీధి, సెంగుందర్ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉర్సవర్లకు ఆస్థానం నిర్వహించారు. ఏఈఓ రవి, ఆలయ అధికారి నాగరాజు, అర్చితం అధికారి భరత్ పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం భూత వాహనంపై వీరభద్రస్వామిని ఊరేగనున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

క్వారీ గుంతలపై ఆందోళన


ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు, గిరిజనులు

సత్యవేడు: చమర్తి కండ్రిగ సమీపంలోని సెవెన్ హిల్, జేకే స్టోన్ క్రషర్ క్వారీలు తీస్తున్న గుంతల కారణంగా గిరిజనులు అటవీ ప్రాంతానికి వెళ్లలేకపోతున్నారని సీపీఐ నియోజవర్గ కార్యదర్శి ఏ. చిన్నిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో గిరిజనులు, దళితులు కలసి క్వారీ సమీపంలో ఆందోళన చేపట్టారు. అటవీ ప్రాంతంలోని గిరిజనులు పొట్టకూటి కోసం ఈతాకు, మారేడు కొమ్మ, తేనె, ఊదర బంక, నెల్లి కాయలు, ఈత ఆకులు తెచ్చుకుని విక్రయించి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. క్వారీ గుంతల కారణంగా అడవిలోకి వెళ్లేందు దారి లేక జీవనాధారం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ నేత చంద్ర, రైతు సంఘం నేత ధనంజయులు, ఏఐవైఎఫ్ నేత పి. మురళి, గిరిజనులు శ్రీనివాసులు, సుధన, చిరంజీవి, ఏసురత్నం, లత, రాజేశ్వరి, నాగరత్నమ్మ, చెంచురామయ్య, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'విద్యాహక్కు' అమలు


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పకడ్బందీగా విద్యాహక్కు చట్టం అమలు చేయాలని ఎంఈఓ రవీంద్రనాథ్ స్పష్టం చేశారు. బుధవారం చలమవారి గిరిజన కాలనీలో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న పిల్లలను, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ చట్ట ప్రకారం బడి ఈడు పిల్లలు స్కూలు బయట ఉండకూడదన్నారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు అందిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం వడ్డిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సతీష్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆగిన ఆధార్ సేవలు

- ప్రజలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

నాగలాపురం: సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న ఆధార్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. ఈ మేరకు నాగలాపురం సచివాలయంలో మూడు వారాలుగా ఆధార్ ప్రక్రియ ప్రజలకు దూరమైంది. దీంతో ఆధార్ మార్పులు, సవరణలు, ఆరు నెలల్లోపు పిల్లలకు నూతనంగా నమోదు కోసం ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కేవలం కొన్ని సచివాలయాల్లో మాత్రమే పూర్తి స్థాయిలో ఆధార్ సేవలు పొందేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే ఆ ప్రాధాన్యతను కూటమి సర్కారు తుంగలో తొక్కేసి ఆధార్ సేవలను పూర్తిగా ఆపేసింది. దీంతో సంక్షేమ పథకాలు ఇతర అవసరాల కోసం ఆధార్ సీడింగ్ చేసుకోవలసిన వారు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఎప్పటి నుంచి ఆధార్ సేవలు అందుబాటులో వస్తాయనే సమాచారం సైతం చెప్పే దిక్కులేని స్థితిలో సచివాలయ వ్యవస్థ నీరుగారిపోయింది. దీంతో ఆధార్ నమోదు కోసం వచ్చే ప్రజలు పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బదిలీల సాకు

ఇటీవల సచివాలయ ఉద్యోగులు బదిలీలు జరిగాయి. అయితే బదిలీ ప్రక్రియ పూర్తయినప్పటికీ ఆధార్ సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు. మండలంలో నాగలాపురం, నందనం, బీరకుప్పం సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఆధార్ సేవలు కోసం ప్రజలు వస్తే సిబ్బంది లేదు బదిలీలో వెళ్లారు. కొత్త వాళ్లు ఎప్పుడు వస్తారో తెలియదు అని తెగేసి చెప్పేస్తుండడం గమనార్హం.

మతం పేరుతో అవమానించడం బాధాకరం


షేక్ సిరాజ్‌బాషా

శ్రీకాళహస్తి: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌ను మతం పేరుతో అవమానించడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ బాషా అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆత్మకూరు ఆర్టీసీ డిపో డ్రైవర్ శ్రీశైలానికి విధుల నిమిత్తం వెళ్లినప్పుడు, ఆలయ గేటు వద్ద టోపీ తీస్తేనే బస్సును అనుమతి ఇస్తామని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడం వివాదంగా మారిందన్నారు. దీనికి వ్యతిరేకంగా స్పందించడంతో కానిస్టేబుల్ బస్సు ఆపాలని ఒత్తిడి తెచ్చాడన్నారు. ఈ వీడియో వైరల్ కావడంతో షేక్ సిరాజ్ బాషా స్పందించి, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే భేదం లేకుండా అన్నదమ్ములుగా కలిసి ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని ఈ కూటమి ప్రభుత్వం మరో యూపీ చేయాలని చూస్తోందన్నారు. పరోక్షంగా మైనారిటీలపై వివక్ష చూపిస్తోందని ఇది ముమ్మాటికి రాజ్యాంగ విరుద్ధమని అని తెలిపారు. ఈఘటనపై సీబీఐ విచారణ వేసి ఈ విషయాన్ని నిగ్గు తేల్చాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. దేవుళ్లకే లేని మతాలు వీరికి ఎందుకని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చూడాలన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతమైతే వైఎస్సార్‌సీపీ తరఫున మతోన్మాదులను ఎదుర్కొంటామని హెచ్చరించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

సత్యవేడు: సత్యవేడు పంచాయతీ పరిధిలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సత్యవేడు పంచాయతీ కుమ్మరిగుంట వీధిలో రామానాయుడు కుమారుడు ధనశేఖర్(58) కుటుంబం నివాసం ఉంటోంది. ధనశేఖర్ భార్య ఐదేళ్ల కిందట మృతి చెందడంతో అప్పటి నుంచి తాగుడుకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఆరోగ్యం మరింత క్షీణించడంతో అతను మంగళవారం రాత్రి క్రిమి సంహారక మందు తాగి మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయరూ!


సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకం దళితవాడలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించారు. బుధవారం దళితవాడలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ స్తంభాలు లేని కారణంగా విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నామని తెలిపారు. ఆర్‌ఐ నల్లయ్య మాట్లాడుతూ ప్రజలకు కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని వెల్లడించారు. డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు, వీఆర్‌ఓ నాగభూషణం, హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా పాల్గొన్నారు.

రుణాల సద్వినియోగంతో ఆర్థికాభివృద్ధి


మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: మహిళలు శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుంటే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం సత్యవేడు ఎంపీడీఓ కార్యాలయంలో 213 మహిళా స్వయం సహాయక సంఘాల్లోని 955 మందికి రూ. 8.34 కోట్ల శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల మెగా చెక్కును అందించారు. జిల్లా స్థాయిలో రుణాలు చెల్లింపులు, ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో సత్యవేడు మండల సమాఖ్య ప్రథమ స్థానంలో ఉందని వెల్లడించారు. ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు, ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, శ్రీనిధి క్లస్టర్ కో-ఆర్డినేటర్ బాషా, దాసుకుప్పం గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుబ్బారావు, డీసీసీ బ్యాంకు మేనేజర్ కార్తీక్, స్టేట్‌బ్యాంకు మేనేజర్ సూర్యప్రకాష్, ఫీల్డ్ ఆఫీసర్ చైతన్య, వెలుగు సీసీలు శివకుమార్, పెల్లయ్య, మురళీకృష్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోటేశ్వరి, ఎంఈఓ కె.ఉష పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి: ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంజీఎం ఆస్పత్రి వైద్యులు తెలిపారు. పట్టణంలోని సరస్వతీబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 250 మంది విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలు చేశారు. డాక్టర్ లక్ష్మీప్రసూన మాట్లాడుతూ 8, 9, 10వ తరగతి చదివే బాలికలు యుక్తవయసులో వచ్చే రుతు సంబంధిత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వైద్యులు వివేక్ చైతన్య, ఉమామహేశ్వర్, అర్చన, హెచ్‌ఎం బృందాదేవి, టీచర్లు పాల్గొన్నారు.

మృతదేహం తల్లిదండ్రులకు అప్పగింత

రేణిగుంట: మండలంలోని రేణిగుంట-శ్రీకాళహస్తి రహదారి గురవరాజుపల్లి సమీపంలో ఈనెల 27వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడి చిరునామాను గుర్తించారు. దర్యాప్తులో కర్నూల్ జిల్లా సిరివెళ్ల మండలానికి చెందిన కె. శ్రీనివాసులు కుమారుడు కుందవరపు వెంకటదుర్గయ్య (20)గా గుర్తించారు. మృతుడు గత కొంతకాలంగా తిరుపతిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ యజమాని బైక్‌ను తీసుకొని పనిమీద వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

బాల్య వివాహాలు నిరోధిద్దాం: డాక్టర్ లహరి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, టీచర్లు, వైద్య సిబ్బంది

తొట్టంబేడు: స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై బుధవారం మండల వైద్యాధికారి డాక్టర్ లహరి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ లహరి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహ రహిత సమాజ స్థాపనకు కృషిచేయాలని కోరారు. అనంతర ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌ఎస్ సంపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ నాగేంద్ర, ఎంపీహెచ్‌ఏ ఏ.వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం వరలక్ష్మి, టీచర్ కుమార్, సుగుణ, పీఈటీ నిర్మల, మెడికల్ స్టాఫ్ పాల్గొని అవగాహన కల్పించారు.

పేదరిక నిర్మూలనకే పీ-4 సర్వే


మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పీ-4 సర్వే చేపట్టినట్లు డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పీ-4 సర్వేపై సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పీ4 సర్వే ద్వారా అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి, వారి ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరికం నిర్మూలన కోసం చేపట్టిన కార్యక్రమం పీ-4 సర్వే అని వెల్లడించారు. మండలంలో వెనుకబడిన 1,690 కుటుంబాలను గుర్తించినట్లు వివరించారు. ఏఓ షణ్ముగం, వైద్యాధికారి మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం వీఎస్‌పురం గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పరిశీలించారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ: సూళ్లూరుపేటలో ఆగస్ట్ 4, 5వ తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభ పోస్టర్‌ను బుధవారం వీఎస్‌పురంలో పార్టీ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట బస్టాండ్ సమీపంలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. పెద్దసంఖ్యలో కార్యకర్తలు, నేతలు తరలిరావాలని కోరారు. నేతలు వెంకటకృష్ణయ్య, పీటర్, వెంకటమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

సత్యవేడు: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడు, జెడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉందని వెల్లడించారు. కుట్రలు, మోసాలు విడనాడి కలిసిరావాలని టీడీపీ నేతలను కోరారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అంబేడ్కర్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు. దాసుకుప్పం బైపాస్ రోడ్డుకు రూ.27 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. తుపాను కారణంగా కొట్టుకుపోయిన కాజ్‌వేల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాటే తనకు శిరోధార్యమని స్పష్టం చేశారు. సత్యవేడు అభివృద్ధికి కూటమి నాయకులందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు.